

## కార్తీక శోభ

కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో సికింద్రాబాద్‌లోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హైదరాబాద్ వార్త



# వణికిస్తోన్న చలి!

### నగరంలో తీవ్రమైన చలి ▼ పడిపోయిన ఉష్ణోగ్రతలు



హైదరాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త : చలిగాలుల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలు దాటినా.. మంచు తగ్గడం లేదు. ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. నగరంలో చలిగాలులు విపతీరతంగా వీస్తున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో 14 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 14.5, పటాన్‌చెరులో 14.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతగా నమోదు అయింది. దీంతో ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులను ఎక్కువగా ఎదుర్కొంటూన్నరు. అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. సాయంత్రం అయిం దంటే చాలు చేతులు బిగుసుకుపోతున్నాయి. బమయట అడుగుపెడదామంటే జనం బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆ సమయంలో ఏదైనా ఆత్యవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ఔటర్ రింగ్‌రోడ్‌లో వెళ్లే వాహనదారులు మార్గం కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందు లు పడు తున్నారు. ఎదురుగా ఏం వస్తుందో తెలియని పరిస్థితి కొందరైతే రోడ్లపై చలి మంటలు కాగు తూ సేద తీరే క్రపయత్నం చేస్తున్నారు. స్వెట్టర్లు వేసుకుంటే తప్ప బయటకు రాలేని పరిస్థితి. వృద్దులు, చిన్నారులు, చలి, పొగ మంచులో బయటకు వెళ్లొద్దని డాక్టర్లు సూచిస్తున్నారు. మూ డు పూటలా వేడివేడి ఆహార పదార్థాలనే తినాలంటున్నారు. ఇక రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవసరం ఉందని అందని అంచనా వేస్తున్నారు వాతావరణ శాఖ అధికారులు.

## నవరసభరితం కార్తీకమాస నృత్య మహోత్సవం



రవీంద్ర భారతి, డిసెంబరు 11 ప్రభాతవార్త : విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీకమాస నృత్యమహోత్సవాలు వందలాదిమంది కళాకారిణుల శాస్త్రీయ నృత్యప్రదర్శనలు పలు అంశాలతో నవరసభరితం, ముగ్ధమనోహరంగా సాగి ఆహుతులైన అశేష ప్రేక్షకులను అబ్బురపరిచి మంత్రముగ్దులను చేశాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవి రవికిషోర్ అధ్యక్షతన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నృత్యోదయ కూచిపూడి నృత్యఅకాడమీ డైరెక్టర్, ప్రముఖ నాట్యగురువు డా. ఆర్.ప్రసన్నరాణి పవిత్ర కార్తీమమాసంలో ఆ పరమశివునికి ప్రీతిపాత్రమైన మాసం, నృత్యాలకే ఆద్యుడైన నటరాజు నర్తలతో పూజలర్పించడం అద్భుతమని నిర్వాహులను అభినందిస్తూ గౌరవ అతిథులు రాందాస్ తేజావత్, స్నేహరాంచందర్, అనుప్రసాద్, డా. పద్మిని నాగుపల్లి తదితరులతో కలిసి ముందుగా ఈనాటి నృత్యప్రదర్శనలు కావించిన కళాకారుల నాట్యగురువులు సిత్మశాస్త్రి, డా. విమల, నేహాపట్నాయక్, విహారికసాయి, టి.రవికుమార్, ఎస్.సుజాత, వై.అనంతలక్ష్మి, స్వప్న తదితరులను ఘనంగా సత్కరించి కళాకారులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

# ఎమ్మెల్యే కాకపాయె..

### అప్పులు పెరిగిపాయె ● ఎన్నికల్లో ఓటమి పాలైన నేతల్లో ఆందోళన

**ఇళ్లు, భూములు తనఖా పెట్టి కోట్లల్లో ఖర్చు**

**అవి సరిపోకపోవడంతో సన్నిహితుల వద్ద అప్పులు**

**ఎన్నికల్లో ఓటమిపాలై తిరిగి ఇవ్వలేని దుస్థితి**

**ఇచ్చినవారు ఒత్తిడి పెంచుతుండటంతో ఆందోళన**





హైదరాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త: ఎమ్మెల్యే అయితే ఎలాగో అలా సంపాదించుచుకోవచ్చు..ఇప్పుడు వచ్చిన అవకాశం మళ్లీ రాదు..పార్టీ టికెట్ ఇచ్చింది ఎలాగైనా గెలిచి తీరాలి అనుకుంటూ గ్రేటర్‌లోను పలువురు నేతలు ఇళ్లు, భూములు, ఫాంహౌజ్‌లను కొందరు తనఖా పెట్టి రుణం తెస్తే.. మరికొందరు పూర్తి అమ్మిమరి ఎన్నికల బరిలోకి దిగారు. అవీ సరిపోకపోవడంతో సన్నిహితులు, బంధువులు, స్నేహితుల వద్ద కోట్లల్లో అప్పులు చేశారు. ఓటుకు నోటు ఖర్చు చేసినప్పటికీ ఎన్నికల్లో ఓటమి పాల య్యారు. దీంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే దానిపై ఇప్పుడు మల్ల గుల్లాలకు పడుతున్నారు. ఎన్నికల్లో పోటీచేసి ఓడాక అప్పుచ్చిన వారు సైతం ఒత్తిడి పెంచుతున్నారు.ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తలలు పట్టుకుం టున్నారు.

**ఒక్కో అభ్యర్థిఖర్చు 40కోట్లు పైనే..** నగర శివారులోని పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు 40కోట్లకుపైనే ఖర్చు చేసినట్లు సమాచారం. టికెట్ ఖరారైనప్పటి నుంచి నామినేషన్ వేసే వరకు ఒకరమైన ఖర్చు అయితే .. నామినేషన్ వేసినప్పటినుంచి పోలింగ్ తేదీ వరకు ఆఫీసుల రెంట్లు, భోజనాలు, కార్యకర్తల ఖర్చులు, బైక్ ర్యాలీలు, బహిరంగ సభలు ఇలా రోజుకు 10నుంచి 20లక్షల ఖర్చు పెట్టినట్లు తెలుస్తుంది. ఆతర్వాత పోలింగ్ చివరి రెండు రోజుల్లో 5-10కోట్లు ఓటర్లకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఇలా అన్నికులపుకుని కొందరు 30-40కోట్లు ఖర్చుచేస్తే మరికొంమంది అభ్యర్థులు 50-60 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. అయితే ఎన్నికల అధికారులకు కఠినంగా వ్యవహరిస్తే పోటీ చేసే అభ్యర్థులకు ఇలాంటి పరిస్థితి రాదని పలువురు రాజకీయ పరి శీలకులు అంటున్నారు. అభ్యర్థులను ఎవరూ నియంత్రిం చకపోవడంతో పోటాపోటీగా ఖర్చుచేసి అప్పులపాల వుతున్నారని తెలుపుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే అంశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారు చెప్పిన మాటలు ఆచరనలో సాధ్యం కాలేదన్న విమర్శలు విపిస్తున్నాయి. ప్రతి ఎన్నికలో ఓటర్లను ప్రలోభ పెట్టే విషయంపై ఆధారాలతో సహా కొందరు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా వాటిపై ఎలాంటి చర్యలలు తీసుకోకపోవడంతో ఇలాంటి సంఘటలు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీంతో వీటిని అవకా శంగా తీసుకుంటున్న అభ్యర్థులు అడ్డగోలుగా ఖర్చుచేస్తూ డబ్బు,మద్యం పంచిపెడుతున్నారు. ఎన్నికల అధికారులు తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించి అడ్డుగోలు ఖర్చుకు అడ్డుకట్ట వేసి అభ్యర్థులపై చర్యలు తీసుకుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని పేర్కొంటున్నారు.

# ఫ్యాన్సీ నంబర్లు

### ఖైరతాబాద్ ఆర్టీఏకు కాసులు కురిపిస్తున్నాయి




హైదరాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త : ఫ్యాన్సీ నంబర్లు రవాణా శాఖకు కాసుల వర్షం కురిపిస్తోంది. సోమవారం ఒక్కరోజే ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయానికి ఫ్యాన్సీ నంబర్లతో రూ.అరకోటి వరకు ఆదాయం వచ్చింది. ఏడు మంది యజమానులు ఈ వేలంలో పోటీపడి ఫ్యాన్సీ నంబర్లను కైవసం చేసుకున్నారు. దీంతో ఒక్కరోజే రవాణా శాఖకు రూ.45,98,490లు ఆదాయం చేకూరింది. అత్యధికంగా టిఎస్09 జిఇ 9999 నంబర్‌కు రూ.17,35లక్షలు ఆదాయం రాగా, అత్యల్పంగా టిఎస్09 జీఎఫ్ 0007 నంబర్‌కు రూ.101,999లు ఆదాయం వచ్చింది. ఫ్యాన్సీ నంబర్లలో ఎక్కువ మంది ఇష్టపడే 9999.. ఈ నెంబర్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ ఏడాది ఇప్పటి వరకు అత్యధికంగా 9999 నంబర్‌కు ఓ వ్యక్తి రూ.21.6లక్షలు చెల్లించారు. ఇక దీనితోపాటుగా సింగిల్ డీజిట్, బాండ్‌స్టైల్ నంబర్లు 0001, 0007, 0009లకూ డిమాండ్ ఉంటోంది. వాస్తవంగా వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేస్తే..వరస క్రమంలో వచ్చే నెంబర్ ఏదో ఒకటి అలాట్ చేస్తారు. అలా కాకుండా స్పెషల్ నెంబర్ల కోసం కొంతమంది ఆరాటపడుతుంటారు. దానికోసం డబ్బు వెచ్చించడానికి వెనకాడరు. అలాంటి వారి కోసమే రవాణా శాఖ సుమారు 20 ఏళ్ల క్రితం ఫ్యాన్సీ నంబర్లను తెరపైకి తీసుకొచ్చింది.

### మధురగాయకమౌళి డాక్టర్ అమలాపురం కన్నారావు

చిక్కడపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త: రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సినీ, భక్తి గీతాలు, ఆకాశవాణి, దూరదర్శన్ 'ఎ'గ్రేడ్ గాయకుడు, మధురగాయకమౌళి డాక్టర్ అమలాపురం కన్నారావును ఘనంగా సత్కరించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి. ఎం.వి.సుబ్బలక్ష్మి వివరించారు.

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు

# మంత్రి వర్గంలో మొండిచేయి

- ➢ జిల్లా కాంగ్రెస్ క్యాడర్‌లో నిరుత్సాహం
- ➢ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ మంత్రి వర్గంలో మొదటి స్థానం
- ➢ తెలంగాణ మంత్రి వర్గంలోనూ మొదటి స్థానం
- ➢ ప్రాధాన్యతకు సంతరించుకున్న రంగారెడ్డి జిల్లాకు ఈ సారి మొండిచేయి
- ➢ అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల్లోనూ విమర్శలు

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సగం స్థానాలకు కైవసం చేసుకున్నప్పటికి ఒకరిద్దరిని కూడా ముందు వరుసలో ఎంపిక చేయకపోవడం కొంత కాంగ్రెస్ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కాంగ్రెస్ నాయకుల్లో ఐక్యత లోపం వల్లే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాకు కొంత చిన్నచూపు చూస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు చూస్తుంటే అధిష్ఠానం కూడా ఈ విషయంలో తగిన సూచనలు చేయడం లేదని అభిప్రాయం కూడా వస్తుంది. రేవంత్‌రెడ్డి రెండవ మంత్రి వర్గ విస్తరణలో జిల్లాకు తగిన న్యాయం చేస్తరా.. అనేది వేచి చూడాల్సిందే.

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 11 పభాతవార్త : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాల తర్వాత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనంతరం రెండవ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన ఎనుముల రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న మంత్రి వర్గంలో రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో అదికార కాంగ్రెస్ పార్టీతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో కాంగ్రె స్, తెలుగుదేశం పార్టీలు పోటాపోటీగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కొనసాగుతున్న తరుణంలో కొన్ని పర్యాయాలు కాంగ్రెస్, మరికొన్ని పర్యా యాలు తెలుగుదేశం ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారాన్ని కొనసాగించిన సమయంలో నాడు ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేసిన నీలం సంజీవ్ రావు, జలగం వెంగల్‌రావు, మర్రి చెన్నారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఎంటి రామారావు, చంద్రబాబు నాయుడు, మర్రి జనార్ధన్‌రెడ్డి, కొణిశెట్టి రోశయ్య, నల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు కూడా కొత్తగా ఏర్పడిన మంత్రి వర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో మొదటి వరుసలో మంత్రులను ఎంపిక చేసిన ఘనత రంగారెడ్డి జిల్లాకే దక్కింది. అలాంటిది నేడు రంగారెడ్డి జిల్లాకు ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటి మంత్రి వర్గం విస్తరణలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం చూస్తుం టే జిల్లాలో సీనియర్ నాయకులు ఉనికిని కోల్పో తున్నారా అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ సారి మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకే మొదటి ప్రాదాన్యత ఇవ్వడం చూస్తుంటే అక్కడ అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలిచినందుకే తగిన ప్రాదాన్యతనిచ్చి తక్కువ స్థానాలు కాంగ్రెస్ గెలిచిన రంగారెడ్డి జిల్లాకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనే ప్రచారం కూడా కొనసాగుతుంది. గత 35 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాకు బలమైన నాయకులుగా పట్లోళ్ల ఇంద్రారెడ్డి, దేవేందర్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి సుదీర్ఘ కాలం తెలుగుదేశం, కాంగ్రెస్ హయాంలో మొదటి వరుస లోనే మంత్రి వర్గంలో కీలక రోల్ పోషించేవారు. అలాంటిది ఈ సారి కాంగ్రెస్‌లో కొంతమంది సీనియర్ నాయకులు ఉన్నప్పటికి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇచ్చుకోకపోవడం పట్ల కొంత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మేదావులు, పలు రకాలుగా చర్చలు చర్చించుకుంటున్నారు.

# హాస్టల్‌లో సౌకర్యాలు కల్పించాలి

### తరగతులు బహిష్కరించి ఆందోళన చేపట్టిన నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థినీలు



ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలో నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థినీలు

సైఫాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త: సక్రమంగా అన్ని వసతులతో హాస్టల్‌లో సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిజాం కళాశాల విద్యార్థినీలు సోమవారం కళాశాల ప్రిన్సిపల్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థినీలు మాట్లాడుతూ నిజాం కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం పిజి విద్యార్థులకు సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్‌లో హాస్టల్ సౌకర్యం కల్పించిందని, ఇందులో ఏలాంటి సౌకర్యాలు లేవని ఒక్కొక్క రూమ్‌లు 25 నుంచి 30 మంది విద్యార్థినీలు ఉంటున్నామని, ఒక్కొక్క బెడ్ మేద ఇద్దరు, ముగ్గురు పడుకోవల్సి వస్తున్నదని, నీటి సౌకర్యం సక్రమంగా లేదని, టాయిలెట్స్ ఘోరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలు మార్లు కళాశాల ప్రిన్సిపల్‌కు విజ్ఞప్తి చేశామని, ప్రిన్సిపల్ పట్టించుకోకుండా అవమానకరంగా మాట్లాడారని, మీకు స్టార్ హోటల్స్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారా ? అంటూ విమర్శించారని వారు ఆరోపించారు. తమకు సరైన సౌకర్యాలు లేక ఆనేక ఇబ్బందులు పడుతున్నామని, తమతోపాటు న్యూ సైన్స్ కళాశాల విద్యార్థినీలు కూడా ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే కళాశాలలో ప్రిన్సిపల్ లేకపోవడంతో ప్రిన్సిపల్ వచ్చేం తవరకు ఆందోళన చేపడతామని విద్యార్థినీలు హెచ్చరిం చారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో కళాశాలకు వచ్చిన డిసిపి, ఎసిపి, అబిడ్స్ సిఐ, పోలీసులు విద్యార్థినీలను శాంతింపజేయడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. కాని విద్యార్థినీలు ఆందోళనలను కొనసాగించారు. చివరికి మంగళవారం ఉదయం 11 గంటలకు కళాశాల ప్రిన్సిపల్‌తో మాట్టాడిస్తామని పోలీసు అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.

**పరీక్షలను బహిష్కరించిన విద్యార్థులు..** సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజు చెల్లించలేదని 15 మంది విద్యార్థులను ఎగ్జామ్ రాయనీయకుండా సోమవారం నిజాం కళాశాల సిబ్బంది అడ్డుకోవడంతో విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎగ్జామ్ ఫీజు చెల్లింపు విషయం తమకు తెలియదని, అందువల్ల ఫీజు చెల్లించలేకపోయామని, ఇప్పుడు ఫీజు చెల్లిస్తాం, ఎగ్జామ్‌కు అనుమతి ఇవ్వాలని విద్యార్థులు కోరారు. ఇందుకు కళాశాల వైస్-ప్రిన్సిపల్ నిరాకరించడంతో వారి తోటి విద్యార్థులు సైతం ఎగ్జామ్‌ను బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు. విద్యార్థులందరికి ఎగ్జామ్‌కు అనుమతి ఇవ్వాలని, అప్పటి వరకు తాము ఎగ్జామ్‌లో పాల్గొనబోమని హెచ్చరించారు.

### మహాలక్ష్మి పథకాన్ని స్వాగతిస్తున్నాం

## ఆటో డ్రైవర్లకు న్యాయం చేయండి

సైఫాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచితంగా బస్‌లలో రవాణా సదుపాయాన్ని కల్పించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి స్వాగతించింది. కాని గత పది సంవత్సరాలుగా వంద శాతం ఇంధనం చార్జీలు, రవాణా పన్నులు పెరిగాయని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా డ్రైవర్ల బ్రతుకులను ఆదోగతి పాలు చేసిందని జెఎసి ఆరోపించింది. సోమవారం నాడిక్కడ జెఎసి నాయకులు బి.వెంకటేశం, అమానుల్లాఖాన్ తదితరులు సమావేశమై మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రవాణారంగ కార్మికుల సంక్షేమ కోసం బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్‌కు 12 వేల రూపాయలు అందజేయాలని, ఆటో మీటర్ చార్జీలను పెంచాలని వారు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు.

### లోన్ మంజూరైనట్లు ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్

## రూ. 58వేలు చెల్లించి మోసపోయిన వ్యక్తి

అడ్డగుట్ట, డిసెంబర్ 11 ప్రభాతవార్త: ఆన్‌లైన్ పర్సనల్ లోన్ ఆశచూపించి ఓ వ్యక్తి వద్ద నుంచి ఫైనాన్స్ యాప్ వాళ్ళు రూ. 58వేలు కాజేసిన సంఘటన తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం తుకారంగేట్‌లోని సాయి నగర్ ప్రాంతానికి చెందిన అనిల్ (46) వృత్తిరిత్యా ప్రైవేట్ ఉద్యోగి. అయితే ఇటీవల అతను తన ఫోన్‌లో ఫేస్‌బుక్ చూస్తుండగా ఇండియా బుల్స్ ఫైనాన్స్ అనే యాప్‌లో రూ. 5లక్షల వరకు లోన్ మంజూరు అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఆకర్శితుడైన అనిల్ వెంటనే లోన్ కోసమై ఇండియా బుల్స్ ఫైనాన్స్ వాళ్లని సంప్రదించాడు. రూ. 5లక్షల లోన్ మంజూరు అయినట్లు వారు తెలిపారు. లోన్ అప్రూవల్ కోసం కొంత డబ్బు కంపెనీకి చెల్లించాలని మాయమాటలు చెప్పి రూ. 58వేలు అనిల్ వద్ద నుంచి ఫోన్ పే ద్వారా కట్టించుకున్నారు. రోజులు గడుస్తున్నా లోన్ ఇవ్వపోవడంతో ఫైనాన్స్ యాప్‌కు సంబంధించిన వాళ్లు స్పందించకపోవడంతో మోసపోయానని ఆలస్యంగా తెలుసుకున్న అనిల్ వెంటనే తుకారంగేట్ పోలీసులకు ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరపుతున్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్లు రికవరీ



సెల్ ఫోన్లను బాధితులకు అందచేస్తున్న దోమలగూడ పోలీసులు

ముషీరాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త: దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేసి తిరిగి బాధితులకు అప్పగించారు. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల కొంతమంది సెల్‌ఫోన్లు పోయాయంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి, 12 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి, ఏసీపీ రవికుమార్ చేతుల మీదగా సోమవారం బాధితులకు అందచేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళన చెందకుండా సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే చాలని, పోయిన ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితులకు అందచేస్తామని తెలిపారు. ఒకవేళ సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయటం తెలియకపోతే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఫిర్యాదు అందుకున్న అనతికాలంలోనే ఫోన్‌లను ట్రేస్ చేసి బాధితులకు అప్పగించిన దోమలగూడ క్రైం టీంను ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరెడ్డి, డీఐ వరప్రసాద్, డీఎస్‌ఐ శ్రీకాంత్, క్రైం టీం పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి అనసూయ

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ఎదగాలి : జంపనప్రతాప్



గిరిజన హాస్టల్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న జంపనప్రతాప్, సిఐలు లక్ష్మినారాయణ రెడ్డి, నాగయ్య

కంటోన్మెంట్, డిసెంబర్ 11 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో అభివృద్ధి చెందాలని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్లు లక్ష్మినారాయణ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌లు తెలిపారు. సోమ వారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ముఖ్య అతి థులుగా హాజరై ప్రసంగించారు. క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య, గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంధ్యారాణి, అధికారులు జ్యోతి, తిరుమల, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఇన్‌ఛార్జి ససుధీర్, ప్రతినిధులు రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి పైప్ లైన్ వేయాలి



బ్రాహ్మణవాడీలో వాటర్‌లైన్ గురించి వాటర్ వర్క్స్ అధికారితో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నాయకులు నెమలి ఆనంద్

బేగంపేట డిసెంబరు11,ప్రభాతవార్త : ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణం చేయాల్సిన తాగునీటి పైప్ లైన్ ను పక్కాగా వేయాలని,బీజేపీ సీనియర్ నాయకులు నెమలి ఆనంద్ అధికారులను కోరారు.సోమవారం బేగంపేట బ్రాహ్మణవాడీలో నూత నంగా వాటర్ లైన్ నిర్మాణ విషయంలో పాత వాటర్‌లైన్ కిందికి ఉందని,కొత్తలైన్ పైకి ఎందుకు వేస్తున్నారని,దీనివల్ల నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడుతుందన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకులు నెమలి ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆ ప్రాంతానికి చేరుకున్న ఆనంద్ వాటర్‌వర్క్స్ అధికారి వెంకటరెడ్డిని ప్రశ్నించారు. పైప్‌లైన్ల ఏర్పాటు విషయంలో ఒక లైన్ కిందికి మరొక లైన్ పైకి వేస్తే నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడవచ్చు కదా అంటూ ఈ విషయాన్ని స్థానికులకు వివరించాలని కోరారు.వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న ప్రకాష్ నగర్ వాటర్ వర్క్స్ మేనేజర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో ఉన్న పాతలైన్ కు కొత్త లైన్ కు జంక్షన్ చేస్తామని చెప్పగా అలా చేస్తే నీటి ప్రెజర్ లో ఇబ్బంది రావచ్చని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అలా అయితే పాత పైప్ లైన్ లెవల్ లోనే కొత్త పైప్‌లైన్ వేసేలా చర్యలు తీసుకుంటామని, రెండు మూడు రోజుల్లో లైన్ పూర్తయ్యేలా చూడాలంటూ సిబ్బందికి సూచనలిచ్చి సమస్యను పరిష్కరిస్తామంటూ ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ యువమోర్చా డివిజన్ అధ్యక్షులు తారకంపేట్ శ్రవణ్, ప్రధాన కార్యదర్శి నాని,బస్తీ వాసులు రాంచందర్,పాండు, నవీన్,దేవేందర్,చింటూలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దానంకు పాస్టర్ల ఆశీస్సులు, అభినందనలు



ఫిల్మ్‌నగర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త : ఫిల్మ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖైరతాబాద్ పాస్టర్ల ఫెలోషిప్ బృందం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆశీర్వదించి అభినందించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పీటర్ బొజ్జ నేతృత్వంలోని పాస్టర్స్ బృందం ఎమ్మెల్యేకు శాలువా కప్పి బొకె ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ తన గెలుపులో కీలక పాత్ర పోషించారని ధన్యవాదాలు తెలిపారు. ఖైరతాబాద్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ పీటర్ బొజ్జ మాట్లాడుతూ ఎన్నికల ముందు పాస్టర్స్ ఇచ్చిన ఆశీర్వాదము, ఆకాంక్షలు మేరకు దానం నాగేందర్ తిరిగి ఎమ్మెల్యేగా గెలిచినందుకు అభినందనలు తెలిపారు. క్రిస్టియన్లకు కమ్యూనిటీ హాలు గ్రౌండ్‌ను మంజూరు చేయవలసిందిగా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బి.పీటర్‌తో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షులు ఆంథోని దాసు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ థామస్‌రాజు, సలహాదారులు పాల్ కరుణాకర్, రూబెన్ దాస్, అశోక్, పీటర్ సామ్యూల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పికిల్‌బాల్ క్రీడను విస్తరించేందుకు కృషి

### గేమ్‌పాయింట్ సహ వ్యవస్థాపకులు సిద్ధార్థ్‌రెడ్డి



అత్యాధునిక కోర్టులను ప్రారంభిస్తున్న సిద్ధార్‌రెడ్డి, అనిల్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాత వార్త: పికిల్‌బాల్‌క్రీడను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజే సేందుకు హైదరాబాద్ అంతటా అనేక కోర్టులను నియమిస్తు న్నామని గేమ్‌పాయింట్ సహ వ్యవస్థాపకులు సిద్దార్థ్‌రెడ్డి తెలి పారు. ఈమేరకు సోమవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ కామినేని సమక్షంలో మూడు అత్యా ధునిక పికిల్‌బాల్ కోర్టులను ప్రారంభించారు. ఈసందర్భంగా సిద్ధార్థ్‌రెడ్డి మాట్లాడుతూ పికిల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణతో టోర్నమెంట్‌ల ద్వారా భారతదేశంలో క్రీడల వృద్ధిని పెంచడానికి సిద్ధంగా ఉన్నామనత్నారు. పిల్లలకు, పెద్దలకు కోచింగ్ అందించడంతోపాటు టోర్నమెంట్‌లు నిర్వహించడం, క్రీడలు ఆడేందుకు అత్యాధునిక కేంద్రాలను అందించడం వంటి వ్యూహాత్మక కార్యక్రమాలను గేమ్‌పాయింట్ నిర్వహిస్తుందన్నారు. ప్రెసిడెంట్ అనిల్ కామినేని మాట్లాడుతూ పికిల్‌బాల్‌కు యుఎస్‌ఏలో చాలా ఆదరణ ఉందని ఈక్రీడను మనరాష్ట్రంలోను ప్రవేశపెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈక్రీడ వినోద కార్యకలాపంగా, శారీరక శ్రమ సమ్మేళనంగా ఉంటుందని పేర్కొన్నారు.

## మాట ఇచ్చినం.. నెరవేరుస్తున్నాం

### శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్




)కాంగ్రెస్ నాయకులతో కలిసి మహాలక్ష్మి పథకం అమలుపై సంబరాలు చేసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్

సైబరాబాద్ ప్రతినిధి, డిసెంబరు 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నెరవేరుస్తున్నామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం మీద చందానగర్ డివిజన్ పరిధిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటించిన 6 గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్యసాయం 10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో పార్టీ ప్రకటించిన అన్ని గ్యారెంటీలను, పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలు ఎటువంటి ఖర్చు లేకుండా రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ఆర్‌టిసి బస్సులో ప్రయాణించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునందన్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, గఫూర్, యాదయ్యగౌడ్, ఖాన్, అలీ, యాదగిరి, ఏకాంత్‌గౌడ్, రాజన్, రవికుమార్, సురేష్, ప్రవీణ్, రాంబాబు, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితను సన్మానిస్తున్న అయ్యప్ప స్వాములు, బిఆర్ఎస్ నేత దేవుడు తదితరులు

## ఎమ్మెల్యే లాస్యకు అభినందనలు

కంటోన్మెంట్, డిసెంబర్ 11 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాసన్య నందిత తెలిపారు. కంటోన్మెంట్‌కు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు, బిఆర్ఎస్ నేత డి.బి.దేవేందర్ (దేవుడు)లు ఎమ్మెల్యే లాస్యకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు నివేదిత, 4వ వార్డుకు చెందిన పలు బస్తీల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు పూజలు



అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 11ప్రభాతవార్త: చారిత్రాత్మకమైన మైసిగండి మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.ఈ పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాంపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ అగర్వాల్,విజయ్ కుమార్ బాల్కే తదితరులు పాల్గొన్నారు.

## లడివార్ సాంతియా శిక్షణ పూర్తి చేసుకున్న 33మంది విద్యార్థులు



అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 11 ప్రభాతవార్త:గౌలిగూడలోని సెంట్రల్ గురుద్వారాలో దక్షిణ భారత దేశంలోనే మొదటిసారి గురు గ్రంథ సాహెబ్ పఠనానికి సంబంధించిన లడివార్ సాంతియా తప్పులు లేకుండా పఠించడమే కాకుండా కీర్తించడం) 33 మంది శిక్కు విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తకథ్ హజూర్ సాహెబ్ సిక్ హెడ్ గ్రంథి సాహెబ్ కాశ్మీరసింగ్,నాందేడ్ లంగర్ సాహెబ్‌కు చెందిన సంత్ బాబా బల్విందర్‌సింగ్‌జీ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు,సర్టిఫికెట్లను అందచేశారు.జ్ఞానీ హర్నిల్‌సింగ్ ఆధ్వర్యంలో 33 మంది విద్యార్థులు శిక్షణ కార్యక్రమాని ౖ విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.అంతకు ముందు సిక్కు సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించడమే కాకుండా గురు గ్రంథ సాహెబ్ పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ గురుద్వారా అధ్యక్షులు ఇందర్‌సింగ్ సిక్కు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతనే బలంగా టిఎన్‌జిఓస్ యూనియన్ ముందుకు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 11, ప్రభాతవార్త : ఐక్యతనే బలంగ టిఎన్‌జిఓస్ యూనియన్ ముందుకు వెళ్తుందని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఉంటే యూనియన్ ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు, ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్ పేర్కొన్నారు. జిల్లాలోని టిఎన్‌జిఓస్ యూనిట్స్ పదవుల కమిటీల ఖాళీల భర్తీ చేయాలని ఇటీవల జరిగిన జిల్లా సమావేశంలో నిర్ణయించినట్లు ఈ మేరకు ప్రజాస్వామ్య పద్ధతిలో సోమవారం టిఎన్‌జిఓస్ కేంద్రకమిటీ సభ్యులు ఎన్నికల అధికారులు పాలుబై ఈశ్వర్, జిల్లా కార్యదర్శి భరత్‌లు ఎన్నికలను న్యాయబద్ధంగ నిర్వహించారు. ఖాళీగ ఉన్న శామీర్‌పేట మండల యూనిట్‌కు అధ్యక్షులుగ గంగుల రవియాదవ్ (ఎఇఒ)ను, మండల కార్యదర్శిగ శైల్‌పల్వాన్ (ఐటిఐ) ఎటిఒను సభ్యులు ఎన్నుకోవటం జరిగిందన్నారు. ఎన్నికైన వారిని జిల్లా అధ్యక్షునితో పాటు పలువురు అభినందించారు.


**IN THE COURT OF THE HON'BLE Ist ADDL. SENIOR CIVIL JUDGE R.R.DISTRICT AT L.B.NAGAR**

**O. S. No. 1876 of 2018**

Between:
B. Madhusudhan Goud ... Plaintiff
And
S. Vishwanath and others ...Defendants
To
1. J. Ramachandraiah, S/o. J. Shivaiah, Aged about 51 years, R/o. LIG-111, Balajinagar,Kukatpally, Hyderabad - 500 072
2. Kadumur Anandam, S/o. not known to the plaintiff aged about 50 years, C/o. J. Ramachandraiah,R/o. LIG-111, Balajinagar, Kukatpally, Hyderabad
3. T. Manikyala Rao, S/o.T. Narsimha Murthy, aged about 68 years, R/o. Flat No.B-202 Pear Creck Apartment, Rajbhavan Road, Somajiguda, Hyderabad
...Defendant No.2,4,5

Please take notice that the Plaintiff has filed above suit for Perpetual Injunction against you and others and the said case is posted on 20-12-2023 for your appearance. Therefore, you are hereby called upon to appear either in person or through an Advocate in the above said suit before the Hon'ble 1st Addl. Senior Civil Judge, R.R.District at L.B.Nagar on 20-12-2023 at 10.30 a.m., failing which the case will be decided on merits in your absence.

// BY ORDER OF THE COURT//
M.NAVANEETHA RAO
Smt. VIJAYAVANI
Advocates
Off: Flat No.202, 2nd Floor, Gokul Enclave, Opp. Govt. Jr. College, Kukatpally, Hyderabad -72 Ph.No.098489 23135



తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, MRO కార్యాలయం ప్రక్కన, సరూర్‌నగర్, హైదరాబాద్. ఇ-మెయిల్: eec3.ghmc@gmail.com

కొటేషన్ ప్రకటన

**కొటేషన్ ప్రకటన నం.EE/HYTNR/LBNZ/15/2023-24/301, తేది: 11.12.2023**

దిగువ సంతకందారులు పేరొందిన సంస్థల నుండి 14.12.2023న లేదా ముందు చేరే విధంగా సీల్డ్ టెండర్లు కోరుతన్నారు. కొటేషన్‌లు 14.12.2023న ఉ.11.00 గం. వరకు స్వీకరింపబడి వాటిని ఉ.11.30 గం.లకు తెరువబడును. ఇతర వివరాలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుండి కార్యాలయ వేళలలో పొందవచ్చును. **క్ర.సం.1, 2, 3 ఐటమ్ వివరణ:** 1) ఇంజనీర్-ఇన్-ఛార్జ్ ముందస్తు అనుమతితో ఇంటర్నల్ రిప్యూట్ యొక్క సమానమైన బ్రాండ్‌లు లేదా ఓటీస్, షిండ్లర్, కోన్, జాన్సన్, థైస్సన్ క్రప్, వంటి ఎలివేటర్ బ్రాండ్‌ల యొక్క గార్డ్ రైల్స్ వగైరాలతో పైకి మరియు కిందకు కదలికకు మేన్యువల్ ఆపరేషన్‌ల ఏర్పాటు కలిగి బయట వాతావరణ పరిస్థితులకు అనువు అయిన ఆటోమేటిక్ రెస్క్యూ పరికరం, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు/స్కైవేల 2 స్టాప్‌లు కలిగిన 9001 : సర్టిఫైడ్ ISO గేర్‌లెస్ MRL ఎలివేటర్ ఆటోమేటిక్ డోర్, 10 మంది ప్రయాణీకుల యొక్క సరఫరా, స్థాపన. 2) ఇంజనీర్-ఇన్-ఛార్జ్ సూచన ప్రకారం పని ఫినిష్ ఐటమ్‌కు ప్రాఫిట్ కాంట్రాక్టర్ మరియు ఓవర్ హెడ్ కలిపి (హనీవెల్/సాంసంగ్ విన్స్‌వైట్ తయారీ) కావలసినట్లుగా ఉపకరణాలతో మరియు UL లిస్టెడ్ ఆల్ మౌంట్స్‌తో 8MP IP బుల్లెట్ కెమెరా సరఫరా. 3) ఇంజనీర్-ఇన్-ఛార్జ్ సూచన ప్రకారం పని యొక్క పూర్తి ఐటమ్‌కు ప్రాఫిట్ కాంట్రాక్టర్లు మరియు అన్ని ఓవర్ హెడ్ కలుపుకొని లేబర్, రవాణా ఖర్చులతో, పేరు డైరెక్షన్‌లతో సూట్ లామినేషన్‌తో, 3M వినైల్ ఎకో స్వాలంట్, 3mm ACPతో సంతక సంకేతాల సైనేజ్ బోర్డుల దిగింపు, ఏర్పాటు, సరఫరా. **పరిమాణం:** లేదు. **యూనిట్:** ఒక్కొక్కటి చొప్పున. **మొత్తం:** లేదు. **నియమ నిబంధనలు:** 1) 14.12.2023న ఉ.11.00 గం.ల వరకు స్వీకరించవలసిన కొటేషన్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్3, హయత్‌నగర్, GHMC కార్యాలయంలో అవే ఉ.11.30 గం.ల వద్ద తెరువబడతాయి. 2) ఏ కారణం వ్యక్తీకరించవలసిన అవసరం లేకుండానే, EE, హయత్‌నగర్ వారు కొటేషన్లను రద్దు చేయడానికి హక్కు రిజర్వ్ కలిగి ఉన్నారు. సంబంధిత అధికారి చిరునామా: శ్రీ రమేష్ బాబు కె. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, GHMC, హైదరాబాద్.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, GHMC**

**DIPR.No.8574-PP/CL/Advt/1/2023-24, తేది: 11.12.2023**


# అక్రమ అనుమతులు నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త : నిజాంపేట్ కార్పోరేషన్ పరిధిలో బాచుపల్లి, నిజాంపేట్ గ్రామాలలో వివిధ సర్వే నెంబర్ల నందు ఆక్రమణ, అక్రమ అనుమతుల నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అలాగే ఈ ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలకు సహరిస్తున్న సంబంధిత అధికారులపూ చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమం లో పూర్తి ఆధారాలతో జిల్లా కలెక్టర్ పి.గౌతమ్‌కి బిజెపి అధ్యక్షుడు ఆకుల సతీష్ బిజెపి శ్రేణులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్, రెవిన్యూ ఇరిగేషన్ అధికారుల సహకారంతో రాత్రికి రాత్రే ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని, అక్రమ కట్టడాలు కడుతున్న కూడా అధికారులు చర్యలు తీసుకోకుండా, అక్రమ నిర్మాణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు, చెరువులు పార్కులు కబ్జాకు గురవుతున్నాయని, ఇప్పటికైనా నిజాంపేట, బాచుపల్లి నందు ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి, కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. తక్షణమే చెరువును ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, చెరువులు ఆక్రమనలు కూల్చివేసి, చెరువుచుట్టు గతంలో లాగా ఫెన్సింగ్ వేసి రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విధంగా నిజాంపేట్ కార్పోరేషన్ మోడల్ కార్పొరేషన్ కాదని ఎన్నికల సమయాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ భూములు చెరువులు కబ్జాలకు నిలయంగా తయారైందని ఇప్పటికైనా ప్రభుత్వ సంపద ఆక్రమణలపై ఉక్కుపాదం మోపి పరిరక్షించాలని కోరారు. అదేవిధంగా ప్రజాస్తులు కాపాడడానికి కావలసిన విధంగా నిధులు కేటాయించి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ సెక్రటరీ అరున్‌రావు, కిషాన్ మోర్చా ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సర్కార్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి




ప్రసంగిస్తున్న జర్నలిస్టు సంఘం నేతలు

చిక్కడపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త: రాష్ట్రంలో నూతన సిఎంగా బాధ్యతలను చేపట్టిన సిఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను పరిష్కారానికి కృషి చేయాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యుజే) విజ్ఞప్తిచేసింది. మేనిఫెస్టోలో పేర్కొనట్లుగా జర్నలిస్టులందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టు బీమా పథకం తీసుకురావాలని కోరింది. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో హెచ్‌యుజే కార్యవర్గ సమావేశం జరిగింది. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, బి.జగదీశ్ మాటట్లాడుతూ నగరంలో ఏండ్ల నుంచి పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ళ స్థలాలు అందడం లేదని, ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. టిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, జిల్లా కమిటీకి మార్గనిర్దేశనం చేశారు. టిడబ్ల్యుజే కార్యదర్శులు చంద్రశేఖర్, విజయానంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, కోశాధికారి రాజశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగవాణి, ఆఫీస్ బేరర్స్ వీరేష్, సర్వేష్, శివశంకర్, మధుకర్, అచ్చిన ప్రశాంత్, నిస్సార్, లలిత, పద్మరాజు, నర్సింహా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును స్వాగతించిన తిరుపతి టిడిపి శ్రేణులు



పెమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుభాకాంక్షలు తెలుపుతున్న మోహన్ చౌదరి

కూకట్‌పల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులుగా మూడోసారి భారీ విజయంతో గెలుపొందిన మాధవరం కృష్ణారావు సోమవారం తిరుపతికి బయలుదేరారు. ఈ సందర్భంగా తిరుపతి అలిపిరి దగ్గర తెలుగుదేశం పార్టీ తిరుపతి రూరల్ ప్రధాన కార్యదర్శి మోహన్ చౌదరి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వా నించారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధిం చిన కృష్ణారావును ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు పండాల సతీష్‌గౌడ్, ఎరుకల రాములు, శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

శామీర్‌పేట, డిసెంబరు 11, ప్రభాతవార్త : శామీర్‌పేట ఉమ్మడి మండలంలో రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగ స్వాగతం పలికారు. సోమ వారం ఉదయం శామీర్‌పేట ఉమ్మడి మండలం లోని దేవరయాంజాల్, తూంకుంట, శామీర్‌పేట, తుర్కపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఘన స్వాగతం పలికారు. నగరం నుంచి హు స్నాబాద్ నియోజకవర్గానికి రాజీవ్‌రహదారిన వెళుతూ మంత్రి దేవరయాంజాల్‌ను సందర్శించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, రాజీవ్‌గాంధీ, డాక్టర్ వైస్ రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## మహిళలతో కలిసి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన హాఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితా జగదీశ్వర్‌గౌడ్



సైబరాబాద్ ప్రతినిధి, డిసెంబరు 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలకు వివరిస్తూ హాఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితా జగదీశ్వర్‌గౌడ్ సోమవారం చందానగర్ నుంచి మియాపూర్ వరకు బస్సులో ప్రయాణించారు. బస్సులో మహిళలతో కలిసి ప్రయాణిం చిన పూజితా గౌడ్ తోటి మహిళలకు మహా లక్ష్మి పథకం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పూజితా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంక్షేమం కోసం మహా లక్ష్మి పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమం కోసం రాష్ట్రం మొత్తం ఉచితంగా ఆర్‌టిసి బస్సులో ప్రయాణించే విధంగా పథకం అమలు చేయడం అభినందనీ యమని అన్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థి ణులు, మహిళా ఉద్యోగులు, వివిధ పనుల నిమి త్తం ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణించే మహిళలు ఎంతో లబ్దిపొందుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మహా లక్ష్మి పథకాన్ని, రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సాయాన్ని 10లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. అతి త్వరలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీల్లో మిగిలిన వాగ్దానాలను సైతం అమలు చేస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి బస్సులో ప్రయా ణిస్తున్న మహిళలకు స్వీట్లు పంచి మహా లక్ష్మి పథకం సంబరాలను చేసుకున్నారు. ఈ కార్య క్రమంలో రాధ, పార్వతి, మంజులా, అనిత, సుధ, శాంత, సంగీత, కవిత, తస్వీర్‌భేగం, లలిత రాణి, వహిదా, నిర్మల, విజయ్, రజిని పాల్గొన్నారు.

### ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి ముఠాగోపాల్ ద్వారానే సాధ్యం

చిక్కడపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త: ముషీ రాబాద్ ఎమ్మెల్యేగా రెండవ సారి గెలుపొందిన ముఠాగోపాల్ ద్వారానే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమవుతుందని గాంధీనగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు పున్న సత్య నారాయణ, ఆకుల శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్ గుప్త, పోతుల శ్రీకాంత్‌తో కలిసి మాట్లాడారు. గడచిన ఐదు సంవత్సరాల్లో ప్రతిదినం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించిన పేరు ముఠాగోపాల్‌కు ఉందని, ఇందులోభాగంగానే నియోజకవర్గం ప్రజలు రెండవ సారి ముఠా గోపాల్‌కు భారీ మెజారిటీతో పట్టం కట్టారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గాంధీనగర్ డివిజన్ నాయకులను, కార్యకర్తల సమన్వయంతో ప్రచారం చేయడం మూలంగానే విజయం వరించిందని, డివిజన్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం మూలం గానే ప్రజలు విజయాన్ని అందించారన్నారు.


**IN THE COURT OF THE HON'BLE XI ADDL CHIEF JUDGE, HYDERABAD AT: CHETHABAZAR. O.S.NO. 526 OF 2023**

Between:
**Mahesh Kumar Tiwari & others ...Petitioner/Plaintiff**
And
**All concerned ...Respondents/Defendants**

**NOTICE**

The plaintiff has filed the above suit for declaration of legal heirs, in respect of the suit Schedule property. The Hon'ble court was pleased to order for publication of this Notice for your appearance in the above suit and the matter is posted to **22.12.2023 at 10:30 a.m.** and therefore you may appear before this Hon'ble court either in person or through your authorized counsel otherwise the matter will be adjudicated in due process of Law.

**SUHEDULE PROPERTY**

All that the PART/PORTION of House bearing GHMC No. 5-5-57/13, admesuring 200.6 sq. yards or 167.70 sq. mtssitated at Darussalam, Hyderabad, Telangana bounded by:
**East:** NEIGHBOUR'S PROPERTY
**West:** 20'.0' WIDE ROAD
**North:** PORTION OF PROPERTY
**South:** PORTION OF PROPERTY.
Heance this Notice

*(BY ORDER OF THE COURT)*
**G. SANDEEP**
**A. SRIKANTH**
**Advocates**
**Phone:- 7369272177**



**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DIST COURT:: AT: L.B. NAGAR O.S.NO. 830 OF 2023**

Between:
**Kaithi Vivekvardhan Reddy & Others, ...Plaintiff**
And
**Indurthi Karunakar Reddy & All concerned, ...Defendants**
TO,
**2).All Concerned, ...Defendant No.2**

Please take notice that the above O.S. No. 830 of 2023 filed against you for Declaration of legal Heir status being succession, and was pending before the Hon'ble I Addl Junior Civil Judge, Ranga Reddy district court, at L.B.Nagar. The above suit was posted to **02-01-2024** and who ever concerned for the above case and issues they hereby called upon to appear in the court on that day at 10.30 A.M. either in person or through an advocate, if you failed to attend the court on that day the petition will be disposes Ex-party against you.

(BY ORDER OF THE COURT)
**M. SRINIVAS REDDY (ADVOCATE)**
Office ## Plot NO. 37, Road No.1, Visveswaraya Engineers Society, Hastinapuram, R.R.District
**Cell: 9848159089**



**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE :: CITY CIVIL COURTS:: AT SECUNDERABAD: OS NO. 529 / 2019**

Between:
**State Bank of India**
Retail Assets Central Processing Centre, SARC Wing, Patny Centre, Secunderabad, Rep. by its Manager **...Plaintiff**
And
**Mr. R Ashok Kumar ...Defendant**
To
**Mr. R Ashok Kumar**
R/o 2-2-1125/28, NarasimhaBasthi. New Nallakunta, Hyderabad.

Please take notice that the above named plaintiff instituted the above suit against you for recovery of **Rs.2,32,102.00 ps.** You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on **18-12-2023 at 10.30 AM.** In default of your appearance the suit will be heard and decided in your absence.

By order of the Court.
**D.K. LAKSHMI KUMARI**
**Advocate**
Flat No.304, Manikanta Paradise Apart, Dwarakanagar, Phase-II Uppal, Hyderabad, Pin Code-500039
**Cell No. 99488 68080**
**Counsel for the Plaintiff**

## బడంగ్‌పేట్‌లో ఎస్ఎన్‌డిపి పనులపై మేయర్ చిగిరింత పారిజాత సమీక్ష



ఎస్ఎన్‌డిపి పనులపై అధికారులతో సమీక్ష జరుపుతున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఎస్ఎన్‌డిపిపనులపై సమీక్షా సమావేశం జరిగింది. మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సూచనల మేరకు కమీషనర్ బడుగు సుమన్‌రావు ఈ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, ఇఇ కృష్ణయ్య, డిఇఇలు జ్యోతిరెడ్డి, అనూరాధ, ఎఇఇలు వివేకానంద సాగర్, రాజు, వినీల్‌గౌడ్, అవినాశ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు హాజరైన ఈ సమావేశంలో మేయర్ కార్పొరేషన్‌లో చేపట్టిన ఎస్ఎన్‌డిపి పనులపై చర్చించారు. ఇందులో భాగంగా ఆమె పూర్తి అయిన పనులు, అసంపూర్తి పనుల గురించి తెలుసుకొని సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన, పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలతోపాటు మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అసంపూర్తి పనుల పరిశీలన...** సమీక్షా సమావేశం అనంతరం మేయర్ ఎస్ఎన్‌డిపి పనుల పరిశీలన జరిపారు. ఇందులో భాగంగా కార్పొరేషన్‌లో పూర్తి కాని పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. అదే విధంగా ఎస్ఎన్‌డిపి పనులు జరుగుతున్న ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజయంతో మొక్కులు చెల్లించుకున్న నాయకులు



నాగ్‌పూర్‌లోని తాజుద్దీన్ దర్గా వద్ద శ్రీధర్‌గౌడ్ తదితరులు

**సైదాబాద్, డిసెంబరు 11 (ప్రభాతవార్త):** ఎల్‌బినగర్ ఎమ్మెల్యేగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపొందడంతో లింగోజిగూడ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన మైనార్టీ సోదరులు దాదాపు 20 మంది నాగ్‌పూర్‌లోని తాజుద్దీన్ దర్గాను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ ఎల్‌బినగర్‌లో పనిచేసే వ్యక్తికి ప్రజలు మరోసారి పట్టం కట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ సోదరులు పాల్గొనా న్నరు.

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి బిఆర్ఎస్ నాయకుల సత్కారం



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి సత్కరిస్తున్న ఆకుల మహేందర్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 11 (ప్రభాతవార్త) :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిను సోమవారం ఉప్పల్ డివిజన్‌కు చెందిన పలువురు నేతలు కలిసి సత్కరించారు. ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నేతలు ఆకుల మహేందర్, నరేష్, సంపత్, శ్రీనివాస్, బాబురావు తదితరులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుత. బిఆర్ఎస్ పార్టీ విజయానికి పాటుపడిన ప్రతి ఒక్కరికి రుణ పడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ప్రజల కోసం పనిచేసేవారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గణిత మేథోశక్తికి అబాకస్ ఎంతో తోడ్పడుతుంది : కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, అంబిక

**మలక్‌పేట, డిసెంబర్ 11 (ప్రభాతవార్త) :** గణిత మేథోశక్తికి అబాకస్ ఎంతో తోడ్పడుతుందని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, ఎస్ఐపి అబాకస్ మాస్టర్ ట్రైనర్ శ్రీలక్ష్మిలు పేర్కొన్నారు. ఎస్ఐపి అబాకస్ మారేడ్‌పల్లి నిర్వాహకులు అంబికా, కిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు, జోనల్ ప్రాడజి, గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబాకస్‌తో విద్యార్థులలో మేథోశక్తి, ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యార్థులలో పఠనాశక్తి పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. నిర్వాహకురాలు అంబికా, కిరణ్‌లు మాట్లాడుతూ సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించడంతోపాటు ఏకాగ్రత, వేగం స్థాయిలను ప్రదరి ్శంచి బహుమతులను గెలుచుకోవడం జరిగిందన్నారు. ఎస్ఐపి అబాకస్ మారేడ్‌పల్లిలో 11 విభాగాలను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేయడం జరిగిందన్నారు. ఆర్థమేటిక్ జీనియస్ రౌండ్‌లో సెయింట్ మిచెయేల్, గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు పాల్గొనడం జరిగిం దని, విద్యార్థులలో ఆర్థమేటిక్ నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్ర మాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మున్నిఅగర్వాల్, శ్రీవాణి, ప్రవళ్లిక తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డికి సుధీర్‌రెడ్డికి డివిజన్ బిఆర్ఎస్ నాయకుల సన్మానం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న హయత్‌నగర్ డివిజన్ నాయకులు

**హయత్‌నగర్, డిసెంబరు 11 (ప్రభాతవార్త):** ఎల్.బి.నగర్ నియోజకవర్గంనుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, మిదాని కాలనీవాసులు, ముస్లీం కమిటీ ప్రతినిధులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లల్లో ఎమ్మెల్యేగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ గెలుపునకు దోహదం చేశాయన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై రోజువారిగా సమస్యలపై సమీక్షలు నిర్వహిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజల ఆధరాభిమానాలను పొందినట్లు తెలిపారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని, అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, చెన్నగోని మదన్‌గౌడ్, గజ్జి అశోక్, సలీం, చంద్‌పాషా పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



అన్న ప్రసాదం వడ్డిస్తున్న బిఎల్ఆర్, కార్పొరేటర్ పన్నాల

**నాచారం, డిసెంబర్ 11 (ప్రభాతవార్త) :** మల్లాపూర్‌లోని శ్రీ నందీశ్వరాలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ చేశారు. కార్తిక మాసం ఎంతో పవిత్రమైందని బిఎల్ఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలాపూర్ మండలంలోని మల్లాపూర్‌లోనున్న వైఆర్ గార్డెన్స్‌లో జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహాపడి పూజకు హాజరైన టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి: చిత్రంలో మేకల సంజీవ, వంగేటి మధుసూదన్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బద్దం మల్లారెడ్డి, సదానంద్‌రెడ్డి గురుస్వామి తదితరులు ఉన్నారు. (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## జిఓ 57, 58లను వెంటనే రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలి : రాపోలు భాస్కర్



విలేకరులతో మాట్లాడుతున్న న్యాయవాది రాపోలు భాస్కర్

**సైదాబాద్, డిసెంబరు 11 (ప్రభాతవార్త):** పోలీసు రిక్రూట్‌మెంట్ అభ్యర్థుల పాలిట శాపంగా పరిణమించిన జిఓ 57, 58లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. సైదాబాద్‌లోని ఆయననివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐలు, కానిస్టేబుల్స్ నియామకం కోసం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2022లో నోటిఫికేషన్ ఇవ్వగా దాదాపు 9 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని నిబంధనలు, నెగిటీవ్ మార్కులను పెట్టడం జరిగిందన్నారు. ప్రిలిమినరీ పరీక్ష అయిపోయిన తర్వాత అకస్మాత్తుగా నోటిఫికేషన్‌లో లేని నిబంధనలతో జిఓ 57,58లను తీసుకువచ్చి అభ్యర్థులను తీవ్ర గందరగోళానికి గురిచేశారని అన్నారు. ఈ పరీక్ష విషయంలో న్యాయస్థానంలో ఎన్నో కేసులు నమోదయి ఉన్నాయని అన్నారు. పేపర్లు అమ్ముకుని, లీకేజీలు చేసి నిరుదో ్యగులను రోడ్డున పడేశారని, రాష్ట్రాన్ని నాశనం చేశారని అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్లు కక్కుర్తి పడి పేపర్లు అమ్ముకుని అవినీతికి పాల్పడ్డారని, వెంటనే ఇద ్దరు చైర్మన్లను సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలని, దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని, పబ్లిక్ సర్వీస్ కమీషన్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులను ప్రక్షాళన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అభ్యర్థుల పాలిట శాపంగా మారిన జిఓలను రద్దుచేసి కొత్తగా నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు.



యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించడానికి హాస్పిటల్‌కు వెళ్ళిన సందర్భంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని సోమవారం మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి కలిసి కేసీఆర్ ఆరోగ్య పరిస్థిని అడిగి తెలుసుకుంటున్న దృశ్యం. (ఎల్‌బినగర్, ప్రభాతవార్త)

## ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే మల్‌రెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానిస్తున్న చిగురు బాలరాజ్, నర్సింగ్‌రావు తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 11 (ప్రభాతవార్త) :** ప్రజల ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన మల్‌రెడ్డి రంగారెడ్డిని కాంగ్రెస్ నాయకులు నర్సింగ్‌రావు, చిగురు బాలరాజ్ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏకాదశ రుద్రాభిషేకం

### కార్తీక మాసంలో కిటకిటలాడిన ఆలయాలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** కార్తిక మాసం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివలింగాలకు పలురకాల అభిషేకాలతో భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. కొత్తపేట మారుతినగర్‌లోని శ్రీ ప్రసన్నఆంజనేయస్వామి, శ్రీరాజరాజేశ్వరి, శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి వారి దేవాలయంలో సోమవారం శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్తీక మాసంలో భాగంగా నవంబర్ 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు ప్రతిరోజు దేవాలయంలో పరమశివునికి ఏక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం చివరి సోమవారం మాస శివరాత్రి సందర్భంగా లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, మహా జ్యోతిర్లింగార్చన తదితర ప్రత్యేక కార్యక్రమాలు దేవాలయం అర్చకుడు, అలంకార బ్రహ్మ సుధీర్‌శర్మ పౌరోహిత్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు మురళీధర్ రావు, రాయుడు, కామేశ్వరరావు, మల్లేశం పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కా...



ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, డిసెంబరు 11 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా సోమవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిందని మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బస్సులో మహిళలతో పాటు ప్రయాణించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్లు పండుగుల జయశ్రీరాజు, సిద్ధంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, నాయకులు గంట లక్ష్మారెడ్డి, దండెం రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

**ఎల్‌బినగర్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆక్టివ్ సోషల్ వర్కర్ డాక్టర్ బి.విజయరంగ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో నివసిస్తున్న పేద మున్నూరుకాపు మహిళలకు మూడు నెలలు ఉచిత కుట్టు శిక్షణనివ్వడంతోపాటు యూఎస్ఏ ఆత్మీయ సంస్థ ద్వారా ఉత్తీర్ణులైన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ శృంగేరి కాలనీ కమ్యూనిటీ హాల్లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్



గెలుపుకు చిహ్నంగా శాంతి కపోతాలను ఎగురవేస్తున్న బిఎల్ఆర్

**నాచారం, డిసెంబర్ 11 (ప్రభాతవార్త) :** ఉప్పల్ నియోజక వర్గం నుంచి భారి మెజార్టీతో గెలిపించిన ప్రజలు, నాయకులకు, కార్యకర్తలకు ఎంతో రుణపడి ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. 49వేల 426 ఓట్ల భారిమెజార్టీతో ఉప్పల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా బిఎల్ఆర్‌ను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులతో కలిసి నాచారంలోని ఎఎస్ఆర్ గార్డెన్‌లో ఆత్మీయ సన్మానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఆర్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శనియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తించుకుంటానని వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అందరికి పార్టీలో తగిన ప్రాధాన్యతనిస్తానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ



మాజీ సిఎం కెసిఆర్‌ను పరామర్శిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, డిసెంబరు 11 (ప్రభాతవార్త) :** యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్‌ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన మాజీ సిఎం కెసిఆర్ ఆరోగ్యంగా తిరిగి ఇంటికి రావాలని ఆకాంక్షించారు. కెసిఆర్‌తో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజల కోసం పాటుపడే కెసిఆర్ వంటి నేతలు దేశానికి ఎంతో అవసరమన్నారు.అనంతరం మాజీ మంత్రి కేటిఆర్‌ను కలిసి మాజీ సిఎం కెసిఆర్ ఆరోగ్యంగురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మహేష్, కొత్త రామరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరించిన రజక సంఘం నాయకులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సుధీర్‌రెడ్డిని సోమవారం నాగోల్ రజక సంఘం ఆధ్వర్యంలో బొడ్డుపల్లి మహేందర్, బొడ్డుపల్లి మధు నాయకత్వంలో ఎమ్మెల్యే నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, చుక్కయ్య, సహదేవ, కార్తీక్, సంజీవ్ కుమార్, భరత్‌కుమార్, వినయ్‌కుమార్, బి.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్‌లో స్వచ్ టాయిలెట్ క్యాంపెయిన్




స్వచ్ టాయిలెట్ క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**తుర్కయంజాల్, డిసెంబరు 11 (ప్రభాతవార్త):** తుర్కయంజాల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించినట్లు కమిషనర్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడలోని 4వవార్డులోని పబ్లిక్ టాయిలెట్స్ దగ్గర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొని పబ్లిక్ టాయిలెట్స్ దగ్గర రంగులతో ముగ్గులు వేసి, బహిరంగ మల విసర్జన నిషేధంకోసం పాటుపడుతామని ప్రతిజ్ఞ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు బహిరంగ మల విసర్జన చేయరాదని, పబ్లిక్ టాయిలెట్స్ ను వినియోగించుకొని పర్యావరణ పరరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఇఇ హరీష్, జవాన్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుంది : ఎం.పరమేశ్వర్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 11 (ప్రభాతవార్త) :** కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసే వారికి పదవులు దక్కుతాయని ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు ఉప్పల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ పరిధిలో సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీల గురించి హామీ ఇస్తే రెండు గ్యారెంటీలు ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు. సిఎం కెసిఆర్ రేవంత్‌రెడ్డి చొరవతో ఉప్పల్ నియోజకవర్గం మరింత వేగంగా అభివృద్ధి చేద్దామని ఆయన పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి తగు గుర్తింపు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ ఓటమిపై పలువురు నేతలతో సమీక్ష నిర్వహించారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు కృషి చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, తౌఫిక్, సుర్వి మురళీగౌడ్, మేకల రామ కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జలీల్‌పాషా, బోరంపేట కృష్ణ, ఖాజా, మౌలానా, తెల్కల మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, విజయ్, కొంపల్లి బాలరాజు, ప్రకాష్‌రెడ్డి, రఫీక్, రాఘవరెడ్డి, రాజు, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సోమవారం తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఎసిపి, డివిజన్ పరిధిలోని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, మంచాల్, యాచారం పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసారు. (ప్రభాతవార్త, పెద్దఅంబర్‌పేట)